క్లుప్తంగా

కుట్టు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



రేపల్లె రూరల్: మహిళా ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం ప్రారంభించిన కుట్టు శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని ప్రకాశం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో బీసీ వార్షిక ప్రణాళికలో భాగంగా మహిళలకు శనివారం ఉచిత కుట్టు శిక్షణ తరగతులు ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ తరగతులలో తర్ఫీదును పొంది స్వయం ఉపాధిని పొందాలన్నారు. శిక్షణ తరగతులు ముగిసే వరకు ప్రతి రోజు హాజరై ఆయా అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే శిక్షణ తరగతులలో 75 శాతం హాజరుతో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టుమిషన్ అందించబడునన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కాకర్ల సాంబశివరావు, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, ట్రైనీలు తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల సామాజికాభివృద్ధికి పరితపించిన వ్యక్తి శ్రీధర్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



శ్రీధర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

బాపట్ల: పీడిత ప్రజల సామాజికాభివృద్ధి కోసం అనునిత్యం తపించిన వ్యక్తి కామ్రేడ్ జేబీ శ్రీధర్ అని అతని మరణం సీపీఐ పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం సీపీఐ సీనియర్ నాయకులు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేబీ శ్రీధర్ సంస్మరణ సభ సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అధ్యక్షతన జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జంగాల అజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటేశ్వరరావు, శేఖర్, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ జేబీ శ్రీధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని, దళిత హక్కుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి శామ్యూల్, సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్రావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త శివన్నారాయణ, సీపీఎం జిల్లా నాయకులు మజుందర్, ఏఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రత్నకుమారి, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రసాద్, ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి తులసి కుమారి పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్లాట్‌ఫాంలు.. నెరవేరని లక్ష్యం

- చేపలు ఎండబెట్టుకోవటానికి ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులు
- పట్టించుకోని మత్స్యశాఖ



వసతిలేకపోవటంతో తీరంలోనే పడవేసిన వలలు



నిరుపయోగంగా ఉన్న చేపలు ఉంచే తొట్లు



పగిలిపోయిన ప్లాట్‌ఫాం

బాపట్ల: సముద్రంలో వేట సాగించి చేపలు పట్టడం ఒక ఎత్తయితే... వాటిని ఎండబెట్టడం... మార్కెట్‌కు ఎగుమతి చేయటం పెద్ద పనిగా మారింది. ప్రభుత్వం మత్స్యకారులకు ఎంతో చేయూతనిస్తున్నామనే మాటలు ప్రసారాలకే పరిమితమయ్యాయి. తీరప్రాంతం ఎక్కువగా ఉండటంతోపాటు ఐదు వేల కుటుంబాలు వరకు ఉండే అతి పెద్ద నియోజకవర్గమైన బాపట్లలో మత్స్యకారులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. చేపలు ఎండబెట్టేందుకు... ప్యాకింగ్ చేసేందుకు ప్రాసెసింగ్ చేసుకునేందుకు రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాంలు.. సౌకర్యాలు లేకపోవటంతో నిరుపయోగంగా మారాయి. మత్స్యకారులు చేపలు ఎండబెట్టుకునేందుకు, ప్రాసెసింగ్ చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్నాయి

మండలంలోని రామచంద్రపురం తీరంలో చేపలు ఎండబెట్టుకునేందుకు, ప్రాసెసింగ్ చేసుకునేందుకు తొట్లు, ప్లాట్‌ఫాంలను 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. కేవలం ప్లాట్‌ఫాంలు, తొట్లు కట్టించి వదిలిపెట్టారు. వాటికి సంబంధించి కనీసం మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదు. వలలు పెట్టుకునేందుకు కనీస జాగా కూడా లేకపోవటంతో ఎక్కడపడితే అక్కడే వలలు పెట్టి వెళ్లిపోతున్నారు. ప్రాసెసింగ్ యూనిట్‌లో కూడా కావాల్సిన ఐస్‌గానీ, బాక్స్‌లు గానీ లేకపోవటంతో.. ప్రభుత్వం ఏ ఉద్దేశంతో ఏర్పాటు చేసిందో ఆ లక్ష్యం నెరవేరలేదు. కనీసం ఒక్క ఏడాది కూడా ప్లాట్‌ఫాంలపై చేపలు ఎండబెట్టుకోవటం గానీ, ప్రాసెసింగ్ చేయటం గానీ చేయకుండానే సుమారు రూ.5 లక్షలు మేరకు ఖర్చు చేసి చేపట్టిన పనులు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం ప్లాట్‌ఫాంలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉన్న తొట్లు కూడా వాడకపోవటంతో నెర్రెలు కొట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి.

మత్స్యకార గ్రామాలు ఇలా

బాపట్ల పరిధిలో సూర్యలంక, రామానగర్, హనుమాన్‌కాలనీ, దాన్వాయ్‌పేట, రామచంద్రపురం, కృపానగర్, పాండురంగాపురం, ముత్తాయిపాలెం .. కర్లపాలెం మండల పరిధిలో ప్యార్లీ, ప్యార్లీపాడు, తుమ్మలపల్లి, ప్యారల్లీపాడు, నర్రావారిపాలెం, పెద్దపులుగువారిపాలెం.. పిట్టలవానిపాలెం మండల పరిధిలో అల్లూరు, ఎట్టికట్ట గ్రామాలు ఉన్నాయి.

వర్షానికి నష్టపోతున్నాం



మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోవటంలేదు. మత్స్య సంపదను ఆరబెట్టుకునేందుకు కనీసం వసతులు కూడా లేవు. తీర ప్రాంతంలో ఎక్కడపడితే అక్కడ చేపలను ఎండబెట్టుకోవాల్సి వస్తోంది. చేపలు ఎండబెట్టుకున్న తరువాత ఒక్కొక్కసారి వర్షానికి దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నాం.

– చొక్కా సత్యనారాయణ, మత్స్యకారుడు

ప్లాట్‌ఫారాలను బాగుచేయించాలి



రామచంద్రపురంలోని మత్స్యకారులు చేపలు ఎండబెట్టుకునేందుకు ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫారాలను మరమ్మతులు చేయించాలి. కనీస వసతులు కూడా లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నాం. ఎన్నిసార్లు ఈప్లాట్‌ఫారాల గురించి అధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికి పట్టించుకోవటంలేదు.

–బాలచంద్రరావు, మత్స్యకారుడు

ప్యాకింగ్ కేంద్రాన్ని ఉపయోగిస్తాం

రామచంద్రపురం వద్ద ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్యాకింగ్ కేంద్రం నిరుపయోగంగా ఉంది. ఐస్ సమస్య వలన కొద్దిరోజులు మాత్రమే ఆ యూనిట్ నడిచింది. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆ యూనిట్ నడిచే విధంగా చూస్తాం. కొన్ని యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపుతున్నాం.

– కిషోర్, ఎఫ్‌డీవో

కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నిబోయిన ప్రసాద్



బాపట్ల: కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలను మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నిబోయిన ప్రసాద్ హెచ్చరించారు. కోర్టు వివాదం ఉన్నప్పటికీ బీసీ నాయకుడు నర్రావుల వెంకట్రావు సైకిల్‌స్టాండ్‌ను నిబంధనలకు విరుద్ధంగా తొలగించటం హేయమైన చర్యగా పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు సైకిల్‌స్టాండ్ తొలగింపును తీవ్రంగా ఖండించారు. పిన్నిబోయిన ప్రసాద్ మాట్లాడుతూ ఒక పక్కన అభివృద్ధిని తుంగలో తొక్కి మరోవైపు కక్షసాధింపులకు పురికొలుపుతున్నారని దుయ్యబట్టారు. సూపర్‌సిక్స్‌పేరుతో బీసీలను చంద్రబాబు సర్కారు నట్టేట ముంచిందని పీటా వేణుగోపాల్ ధ్వజమెత్తారు. బాపట్ల ఏరియా వైద్యశాల అభివృద్ధి కోసం గత ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రయత్నిస్తే ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు ఆ ప్రతిష్టను దెబ్బతీసేందుకు పావులు కదుపుతున్నారని ఎస్సీ సెల్ నాయకులు జోగి రాజా పేర్కొన్నారు. కోర్టు వివాదంలో ఉన్న స్టాండ్‌ను ఎటువంటి నోటీసు ఇవ్వకుండా టీడీపీ గుండాలను తీసుకువచ్చి ఖాళీ చేయించటం హేయమైన చర్యగా భావించాలన్నారు. పేదలపై కక్షసాధింపు పనులు మానుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు కొండలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, నాయకులు నర్రావుల వెంకట్రావు, యల్లావుల ఏడుకొండలు, కొక్కిలిగడ్డ చెంచయ్య తదితరులు ఉన్నారు.

నేడే రాములోరి కల్యాణం



ఆవులవారిపాలెంలో గ్రామోత్సవం



బాపట్ల రథం బజార్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలువ పందిరి



ఎంవీరాజుపాలెంలో ముస్తాబైన రామాలయం

బాపట్లటౌన్: పట్టణ, మండలంలో ఊరూరా రామాలయాల వద్ద శ్రీరామనవమి పురస్కరించుకొని ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 మధ్యలో సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభోగంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సన్నద్ధం అవుతున్నారు. ఊరంతా పండుగలా జరుపుకునే సీతారాముల కల్యాణానికి సంబంధించిన ఏర్పాట్లు చేయడంలో గ్రామస్తులు నిమగ్నమయ్యారు. రామాలయాలను రంగులతో అలంకరించడమే కాకుండా ఆలయాల ముందు చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు ఆయా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని రథం బజార్ సెంటర్‌లో శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో చలువ పందిరి ఏర్పాటు చేశారు. ఇక్కడ వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వీటితోపాటు పట్టణంలోని భీమావారిపాలెం, బెస్తపాలెం, చీలురోడ్డు, కాకుమానువారిపాలెం, మార్కెట్ సెంటర్, మున్నంవారిపాలెం, ఉప్పరపాలెంలోని రామాలయాల వద్ద ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. మండలంలోని ముత్తాయపాలెం, రామానగర్, ఆదర్శనగర్, అప్పికట్ల, కంకటపాలెం, పాండురంగాపురం, మరుప్రోలువారిపాలెం, పోతురాజుకొత్తపాలెం, దరివాద కొత్తపాలెం, వెదుళ్ళపల్లి, పిన్నిబోయినవారిపాలెం గ్రామాల్లో నేడు సీతారాముల కల్యాణం కనుల పండువగా జరుగనుంది.

ముస్తాబవుతున్న రామాలయాలు

రేపల్లె రూరల్: రాములోరి కల్యాణంకు సర్వం సిద్ధమైంది. శ్రీరామనవమి పురస్కరించుకుని రేపల్లె నియోజకవర్గంలోని ఆలయాల్లో, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఇప్పటికే రామాలయాలను విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు. రైలుపేటలోని పట్టాభిరామస్వామి ఆలయం, కోదండ రామస్వామి ఆలయం, నేతాజీనగర్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయం, పెదపోస్టాఫీసు ఎదురు వీధిలోని రామాలయం తదితర ఆలయాలను వైభవంగా అలంకరించారు. ఆయా వీధులలో తాటాకులతో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. పాత స్టేట్ బ్యాంక్ వద్ద ఏర్పాటు వేసిన చలువ పందిరి, పెదకూరగాయల మార్కెట్‌లో, మార్కెట్ సమీపంలోని విఘ్నేశ్వరుని ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కొల్లూరులో...

కొల్లూరు : శ్రీరామనవమిని పురస్కరించుకకొని రామాలయాలు, రామమందిరాలు సుందరంగా రూపుదిద్దుకున్నాయి. మండలంలోని ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయాల ముందు తాటాకులతో చలవ పందిళ్లు వేయడంతోపాటు, ఆలయ ప్రాంగణాలలో దైవ దర్శనానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని ఆవులవారిపాలెంలోని రామాలయం విద్యుత్ దీపాల అలంకరణతో శోభాయమానంగా మారింది. ఆలయ అర్చకులు శ్రీరామ నవమి పురస్కరించుకొని గ్రామంలో ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: నవమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఏర్పాట్లు సిద్ధం చేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆయా గ్రామాలలోని రామాలయాల వద్ద సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చలువ పందిళ్లు వేసి ప్రత్యేక వేదికలను సిద్ధం చేశారు. చలువ పందిళ్లకు రంగుల కాగితాలను అంటించి మామిడి తోరణాలు కట్టి అరటి చెట్లతో అందంగా ముస్తాబు చేశారు. సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు, భక్తులు వీక్షించేందుకు కావలసిన ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.

కొనుగోలు కేంద్రాలు తక్షణం ప్రారంభించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

కొల్లూరు : రబీలో పండించిన జొన్న, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, తక్షణం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన రెండో పంటగా ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో జొన్న, మొక్కజొన్న పంటలు రైతులు సాగు చేశారని, పండిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర కేటాయించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని కారణంగా దళారులకు తక్కువ ధరకు రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాల ద్వారా జొన్న, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలన్నారు. కొల్లూరు మండలంలో ఉన్న ఇసుక క్వారీల్లో ఇసుక తవ్వకాలు యంత్రాలతో చేపట్టడం కారణంగా భవిష్యత్తులో లంక గ్రామాలలో భూములు కోతలకు గురయ్యే ముప్పు ఉందన్నారు. ఇసుక తవ్వకాలలో యంత్రాల వినియోగం కారణంగా భూగర్భ జలాలు అడుగంటి సముద్రపు నీరు చొచ్చుకొని వచ్చి వాణిజ్య పంటలకు నష్టం వాటిల్లడంతోపాటు, సారవంతమైన భూములు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి ఇసుక క్వారీలలో యంత్రాల వినియోగాన్ని అరికట్టాలని కోరారు. మండలంలోని జువ్వలపాలెం ఇసుక క్వారీని తిరిగి తెరవడంతోపాటు, యంత్రాల వినియోగాన్ని అరికట్టి కూలీలకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు పంతగాని నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్, సీపీఎం మండల కార్యదర్శి వేములపల్లి వెంకట్రామయ్య, మండల కమిటీ సభ్యులు టి.సురేష్, బి.సుబ్బారావులు పాల్గొన్నారు.

ఆటిజంపై అంగన్ వాడీలకు అవగాహన



తెనాలి: ప్రపంచ ఆటిజం అవాహన మాసోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని నాయుడుగారి కుండబిర్యానీ హోటల్‌లో అంగన్‌వాడీ టీచర్ల కు అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. రాజేంద్ర స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ వ్యవస్థాపకులు డాక్టర్ ఏంజెల్ రిచర్స్ మాట్లాడారు. పిల్లల్లో ఆటిజం లక్షణాలను ఎలా కనుగొనాలి? వాటిని ఎలా అధిగమించాలి అనే అంశాలను ఆమె తెలియజేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ తెనాలి సూపర్‌వైజర్ కొడాలి సౌజన్యశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివి

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించిన సర్పంచ్ లలితకుమారి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



కొల్లూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రేపల్లె రూరల్: యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు ఎనలేనివని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: దేశ స్వాతంత్ర్య సమరంలో తన సేవలను అందించటమే కాకుండా స్వతంత్ర్యానంతరం దేశాభివృద్ధిలో జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పట్టణంలోని 18వ వార్డులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేశారు. 18వ వార్డు అరుంధతినగర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కర్రీ వెంకట కృష్ణారెడ్డి, మహిళా కన్వీనర్ నాగలక్ష్మి, ఆర్‌టీపీ అధ్యక్షురాలు వీసం నాగలక్ష్మి, నాయకులు చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, అబ్దుల్ ఖుద్దూష్, రత్నాకర్, డాక్టర్ అతిక్, లియాకత్ భాషా, గౌస్, చందోలు కోటేశ్వరరావు, దున్నా రాంబాబు, విజయానంద్, సజ్జా పద్మావతి, పంతగాని రమేష్, శేషు, శివ, హేమంత్ పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో...

భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్, నాయకులు బి.నాగరాజు, కే.ఆశీర్వాదం, బాబూరావు, చిట్టిబాబు, అగస్టిన్, వెంకట్రావు పాల్గొన్నారు.

కొల్లూరులో...

కొల్లూరు : భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని కొల్లూరులో శనివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుగ్గున మల్లేశ్వరరావు మాట్లాడారు. నేటి యువత జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బుల్లా నవరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు కూచిపూడి మోషే, అమర్తలూరి రమేష్, గరిక రమేష్, గుంటూరు పవన్, కారుమూరి కిషోర్, అత్తోట రత్నకుమారి పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ మాజీ ఉప ప్రధాని, సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్ ఆశయాలు ఆదర్శవంతమైనవని కర్లపాలెం గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి చెప్పారు. శనివారం కర్లపాలెం గ్రామ సచివాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సర్పంచ్ లలితకుమారి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుందరమ్మ, కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య మండల గౌరవ అధ్యక్షుడు మందపాటి పరమానందకుమార్ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నివాళులర్పించారు. కార్యక్రమాలలో నాయకులు అహ్మద్ బాషా, బాజీ, దాసు, వెంకటస్వామి, షేక్ తాజుద్దీన్ ఉన్నారు.

జగ్జీవన్‌రామ్ జయంతికి ప్రాధాన్యత ఇవ్వకపోవటంపై దళితుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

బాపట్ల: డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతికి బాపట్ల జిల్లా అధికారులు సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవటంపై దళిత సంఘాల నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన జయంతిని ఎక్కడో మారుమూల ప్రాంతంలో నిర్వహించటం ఏమిటంటూ దళిత నాయకుడు డాక్టర్ చార్వాక ప్రశ్నించారు. శనివారం స్థానిక మార్కెట్ సెంటర్ వద్ద జగ్జీవన్‌రామ్ జయంతి సభలో చార్వాక మాట్లాడుతూ దళితులకు ప్రాధాన్యత కల్పించకపోవటం సరికాదని మాట్లాడుతుండగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు ఇది రాజకీయ వేదిక కాదని, ఇక్కడ మాట్లాడవద్దంటూ సమాధానం చెప్పారు. దీంతో దళితులు మాట్లాడేందుకు అవకాశం లేని ఈ సభ మాకొద్దంటూ అక్కడ నుంచి బయటకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. దళితుల గొంతు నొక్కే విధంగా చూడటం సరికాదని సూచించారు. నిరసన తెలిపిన వారిలో దళిత నాయకులు శీలం రోజన్‌బాబు, నత్తాని యేల్, పర్రె కోటయ్య, గుద్దే రాజారావు తదితరులు ఉన్నారు.

విద్యతో పాటు నైతిక విలువలూ ముఖ్యమే

ఐఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఐఆర్ఐఎస్ఈ రాష్ట్ర చైర్మన్ కోగంటి శ్రీకాంత్

తెనాలి: విద్యార్థులు స్కూలు విద్యతోపాటు నైతిక విలువలను అలవరచుకోవాలని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్, ఐఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఐఆర్ఐఎస్ఈ రాష్ట్ర చైర్మన్ కోగంటి శ్రీకాంత్ సూచించారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా వివిధ రంగాల్లోనూ ప్రవేశం సాధించేందుకు కొంత సమయాన్ని కేటాయించాలని చెప్పారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రీ పాఠశాల 14వ వార్షికోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. గుంటూరులోని స్టెమ్ పాఠశాల ప్రిన్సిపాల్, గుంటూరు డయోసిస్ సొసైటీ గవర్నింగ్ బాడీ సభ్యుడు రెవరెండ్ ఫాదర్ భరత్‌రెడ్డి యెరువా, పీపుల్ కంబైన్ డైరెక్టర్, ఓఆర్‌టీయూఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ (హైదరాబాద్) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న మండవ హాజరయ్యారు. తొలుత జ్యోతిప్రజ్వలనతో వేడుకలను ఆరంభించారు. తమ విద్యాసంస్థలో విద్యనభ్యసించిన విదద్యార్థులు ఉన్నతస్థానాల్లో ఉన్నారని డాక్టర్ ప్రసన్న మండవ చెప్పారు. పాఠశాల విద్యార్థులు, విద్యార్థులు వివిధ నృత్యాంశాలను ప్రదర్శించారు. నృత్యరూపకాలు, స్కిట్స్, దేశభక్తి గీతాలాపన, యోగ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. వెస్ట్‌బెర్రీ పాఠశాల ప్రిన్సిపాల్ టీవీ సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక అధికారి పర్యవేక్షించారు. సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.